

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని శుక్రవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డి కుటుంబ సభ్యులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు.
- అబ్దుల్లాపూర్‌మెట్, ఆంధ్రజ్యోతి



ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్, సిబ్బంది

ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు

హయత్‌నగర్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డుల్లో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను కమిషనర్ సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు పరిసరాలను శుభ్రం చేసి చెత్తా చెదారాన్ని తొలగించారు. 21వ వార్డులో కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మతో కలిసి సిబ్బంది, అధికారులు పరిసరాల పరిశుభ్రత చేశారు. ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు 30 మంది సిబ్బంది పారిశుధ్య పనులు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ఉపయోగించవద్దని, జూట్ బ్యాగులను మాత్రమే వాడాలన్నారు. చెత్తను సేకరించే ఆటోలకు మాత్రమే చెత్తను వేసి పరిసరాల పరిశుభ్రతను కాపాడాలన్నారు. శానిటరి ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, నాగేష్, హరీష్, జవాన్ శివ, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

బాక్స్‌డ్రైన్ పనులు పునరుద్ధరించాలి : కార్పొరేటర్

కొత్తపేట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ కాలనీల్లో ఆగిన బాక్స్ డ్రైన్ పనులను త్వరగా పునరుద్ధరించాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ జలమండలి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన జీహెచ్‌ఎంసీ ఏఈ మాతృనాయక్‌తో కలిసి ఎస్‌ఆర్‌ఎల్ కాలనీ, బృందావన్ కాలనీల్లో పర్యటించారు. ఎస్‌ఆర్‌ఎల్ కాలనీ రోడ్ నెం.3, 12లలో దారుల సమస్యలున్నాయని కాలనీ అధ్యక్షుడు సుధాకర్ విన్నవించారు. బృందావన్ కాలనీలో అంతర్గత దారులు, విద్యుత్ సమస్యలు, డ్రైనేజీ సమస్యలున్నాయని అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ కార్పొరేటర్ పవన్‌కుమార్‌కు తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పవన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో కాలనీల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఆహార పద్ధతులపై విద్యార్థులకు అవగాహన

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కేంద్రీయ ఆయుర్వేద విజ్ఞాన పరిశోధన పరిషత్తుకు చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ గడ్డిఅన్నారం సంస్థ ఆధ్వర్యంలో కుంట్లూర్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యకరమైన ఆహార పద్ధతుల(సీజనల్, రీజనల్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్. వైరా ముత్తు, డాక్టర్. జీపీ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై ఆరోగ్యకరమైన ఆహార పద్ధతులపై అవగాహన కల్పించారు. పౌష్టికాహారం తీసుకునే విధివిధానాలను వివరించారు. ఆహార సేవ, దినచర్య, రుతుచర్య న్యూట్రిషన్‌కు సంబంధించిన ఆయుర్వేద కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాగి లడ్డులను విద్యార్థులకు పంపిణీ చేశారు. శ్రీనివాసరావు, హెచ్‌ఎం శ్రీనివాస్, జంగారెడ్డి పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు హాల్ టికెట్ల అందజేత



విద్యార్థినికి హాల్‌టికెట్ అందజేస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): చంపాపేటలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు శుక్రవారం కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి హాల్ టికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. అనంతరం టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం విజయ, జిల్లా పీఆర్టీయూ టీఎస్ అధ్యక్షుడు కన్నయ్య గారి గోవర్ధన్‌యాదవ్, ఉపాధ్యాయులు జ్యోతిరాణి, అర్జున్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వెంకటేశ్వర్లు, బాలరాజు, సంగీత, గీతాలక్ష్మి పాల్గొన్నారు.

పరీక్షలంటే భయపడకండి.. ప్రణాళికగా చదవండి

కొత్తపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పరీక్షలంటే భయపడకండి ప్రణాళికగా చదవండి అని పదో తరగతి విద్యార్థులకు కొత్తపేట జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు విజయేందర్‌రెడ్డి సూచించారు. కొత్తపేట జడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలకు తయారయ్యే సమయంలో చదువుపైనే శ్రద్ధ ఉంచాలని విద్యార్థులకు సూచించారు. పదో తరగతి విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు, స్కేళ్లు, ఎరేజర్లను అందజేశారు. ఉపాధ్యాయులు శశికళాదేవి, కృష్ణారెడ్డి, పిచ్చిరెడ్డి, మహేందర్‌రెడ్డి, ఉషారాణి, చంద్రలేఖ, రమేష్, శ్రీలత పాల్గొన్నారు.

ఆయిల్ గోదాంలో అగ్నిప్రమాదం

- పేలిన ఆయిల్ ట్యాంకర్లు.. ఎగిసిపడ్డ మంటలు

కార్వాన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఆయిల్ గోదాంలో షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలతో టోలిచౌకిలోని సాలార్‌జంగ్ కాలనీలో శుక్రవారం రాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. హుమాయూన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాలార్‌జంగ్ కాలనీకి చెందిన రత్నారావు కొంతకాలంగా ఆర్టీఏ ఆఫీస్ ఎదురుగా ఆయిల్ గోదాం నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి 10గంటల ప్రాంతంలో ఆయిల్ గోదాంలో షార్ట్ సర్క్యూట్‌తో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. మంటలకు ఆయిల్ ట్యాంకర్లు పేలడంతో పెద్ద శబ్దాలు రావడంతో స్థానికులు పరుగులు తీశారు. ఆయిల్ గోదాం సమీపంలో పెట్రోల్ బంక్ ఉండటంతో ప్రమాదం తీవ్రత పెరుగుతుందని స్థానికులు భయంతో పరుగులు తీశారు. గోదాం దగ్గర పిస్తాహౌస్, షా గౌస్ ఉండటం.. రంజాన్ కావడంతో స్థానికులు పెద్దసంఖ్యలో అక్కడకు రావడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. ఐదు ఫైర్ ఇంజన్ల సాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదానికి కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

రహదారి మధ్యలో ట్రాన్స్‌ఫార్మర్లు

- నిలిచిపోయిన అభివృద్ధి పనులు



సాయిప్రకాష్‌నగర్‌కాలనీలో అర్థాంతరంగా నిలిచిన సీసీ రహదారి నిర్మాణ పనులు

చంపాపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ సాయిప్రకాష్‌నగర్‌కాలనీలో రహదారి మధ్యలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు ఉండటంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం జీహెచ్‌ఎంసీ రూ. 72 లక్షలు మంజూరు చేసింది. ఇంజనీరింగ్ అధికారులు గత నెలలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. రహదారి మధ్యలో ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు అడ్డంకిగా ఉండటంతో పనులు నిలిచిపోయాయి.

ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల షిఫ్టింగ్ కోసం..

రోడ్డు మధ్యలో ఉన్న మూడు ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలను తొలగించాలని కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బైరామల్‌గూడ ట్రాన్స్‌కో కార్యాలయంలో గత నెలలో దరఖాస్తు చేశారు. తరలించేందుకు అయ్యే ఖర్చు కూడా చెల్లించినా నేటికీ అక్కడి నుంచి వాటిని మార్చకపోవడంతో కాలనీ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులు అర్థాంతరంగా ఆగిపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలను తొలగించాలని అధికారులను కోరుతున్నారు.



రహదారి మధ్యలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు

ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలి

సీసీ రోడ్డు నిర్మాణానికి అడ్డంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. దరఖాస్తు చేసి నెలరోజులు అయినా వాటిని అక్కడి నుంచి తొలగించలేదు.

- సి. రాఘవేందర్, కాలనీ అధ్యక్షుడు, సాయిప్రకాష్‌నగర్‌కాలనీ

తొలగించగానే రోడ్డు పనులు చేపడతాం

సీసీ రోడ్డు నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు తొలగిస్తే వెంటనే పనులు చేపడతాం.

-హేమునాయక్, ఏఈ జీహెచ్‌ఎంసీ, హస్తినాపురం డివిజన్

ఎల్‌సీ కోసం ఎదురు చూస్తున్నాం

ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల షిఫ్టింగ్ కోసం సాయిప్రకాష్‌నగర్‌కాలనీ ప్రతినిధులు దరఖాస్తు చేసుకున్నారు. ఫైల్‌ను అధికారులకు పంపించాం. అధికారుల నుంచి ఆదేశాలు రాగానే షిఫ్టింగ్ పనులు చేపడతాం.

-విజయ్‌కుమార్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ, బైరామల్‌గూడ

బీఆర్‌ఎస్ కార్పొరేటర్ ఇంటి ఎదుట బీజేపీ కార్పొరేటర్ ధర్నా

- మేయర్‌పై అవిశ్వాసం అంశంలో మోసం చేశాడని ఆరోపణ
- మీర్‌పేట్‌లో ఘటన



నవీన్‌గౌడ్ ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న నీలా రవినాయక్, ఆమె మద్దతుదారులు

సరూర్‌నగర్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి సంపూర్ణ మద్దతు ప్రకటించి, తమ వద్ద డబ్బు కూడా తీసుకున్న బీఆర్‌ఎస్ కార్పొరేటర్.. తీరా ప్రత్యేక సమావేశం రోజు మరో వర్గంలోకి జంప్ అయ్యాడని ఆరోపిస్తూ మేయర్ పదవి రేసులో ఉన్న బీజేపీ కార్పొరేటర్ నీలా రవినాయక్ తన మద్దతుదారులతో కలిసి శుక్రవారం సదరు బీఆర్‌ఎస్ కార్పొరేటర్ ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. మీర్‌పేట్ 46వ డివిజన్ కార్పొరేటర్ ఉయ్యాల నవీన్‌గౌడ్ తమను నమ్మించి మోసం చేశాడని ఈ సందర్భంగా నీలానాయక్ ఆరోపించారు. తమను మోసం చేయడానికి గల కారణాలేంటో తెలియజేయాలని, తీర్మానానికి మద్దతు ఇస్తానని ముందు ఎందుకు నమ్మబలికాడో స్పష్టం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఆమెకు మద్దతుగా కాలనీ మహిళలు, కుటుంబ సభ్యులు, పలువురు బీజేపీ నాయకులు సైతం ధర్నాలో పాల్గొన్నారు. కాగా ధర్నా సమాచారం అందుకున్న మీర్‌పేట్ పోలీసులు వెంటనే నవీన్‌గౌడ్ ఇంటికి చేరుకుని నీలానాయక్‌తో పాటు ఆమె మద్దతుదారులతో చర్చలు జరిపారు. రాజకీయంగా ఏమైనా ఉంటే వ్యక్తిగతంగా పరిష్కరించుకోవాలని, ఇంటి ఎదుట ధర్నా చేయడం సబబు కాదని, దీని వల్ల స్థానికులకు ఇబ్బంది కలుగుతుందని పోలీసులు సర్దిచెప్పారు. తాము నవీన్‌గౌడ్‌ను పిలిచి మాట్లాడుతామని పోలీసులు హామీ ఇవ్వడంతో నీలానాయక్ ఆందోళన విరమించి తన మద్దతుదారులతో కలిసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. తమ వద్ద డబ్బు తీసుకుని ఎదుటి వర్గంలోకి జంప్ చేసిన వారిని నమ్మకద్రోహులు అనకుండా ఇంకేం అంటారని ఈ సందర్భంగా నీలానాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నమ్మకద్రోహులను విడిచిపెట్టే ప్రసక్తే లేదని ఆమె స్పష్టం చేశారు.

ప్రాచీన కాలంలోనే తెలంగాణలో సాహిత్య ప్రక్రియలు



జాతీయ సదస్సులో మాట్లాడుతున్న ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి

హయత్‌నగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'తెలంగాణ అస్తిత్వం పోరాటాల సాహిత్యం సమాలోచన' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వాధ్యక్షులు ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాచీన కాలంలోనే అనేక తెలుగు సాహిత్య ప్రక్రియలు తెలంగాణాలోనే ప్రారంభమయ్యాయని అన్నారు. అనంతర కాలంలో అవి తెలుగు ప్రాంతాలన్నింటికీ విస్తరించాయన్నారు. దాదాపు 25 తెలుగు సాహిత్య ప్రక్రియల గురించి ఆయన వివరించారు. నిజాం పాలన, రైతాంగ పోరాటం, తెలంగాణ తొలిదశ, మలిదశలో వచ్చిన సాహిత్యం గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్నప్రభ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్లు రాజేందర్‌సింగ్, యాదగిరి, ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య సాగి కమలాకరశర్మ, కె. లావణ్య, సేవా రత్న నక్కా శ్రీనివాస్‌యాదవ్, సదస్సు కన్వీనర్ సురేష్, కోఆర్డినేటర్ చింతల రాకేష్ భవానీ, గంజి శశిధర్, సరస్వతి పాల్గొన్నారు.

మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం

- కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కోట్ల శ్రీనివాస్ పటేల్



అభివాదం చేస్తున్న మున్నూరుకాపు సంఘం నాయకులు

చాదర్‌ఘాట్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు అని కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కోట్ల శ్రీనివాస్ పటేల్ హర్షం వ్యక్తం చేశారు. దిల్‌సుఖ్‌నగర్ మున్నూరుకాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు అనంతుల నవీనపటేల్ ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కోట్ల శ్రీనివాస్ పటేల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మున్నూరుకాపు సంక్షేమానికి సీఎం చేస్తున్న కృషి హర్షణీయమన్నారు. రాష్ట్రంలో ఉన్న 17శాతం మున్నూరుకాపులను అన్ని విధాలుగా ఆదుకునే విధంగా కార్పొరేషన్ ఉపయోగపడుతుందన్నారు. మున్నూరుకాపుల సంక్షేమానికి ఏర్పాటు చేసిన కార్పొరేషన్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సంఘం సలహాదారులు ఎక్క. రమేష్‌పటేల్, పులిపాటి త్రివేది, గౌరవ అధ్యక్షుడు తోట రాజు పటేల్, ప్రధాన కార్యదర్శి చక్రం నాగరాజు పటేల్, క్రాంతి పటేల్, సత్యనారాయణ పటేల్ పాల్గొన్నారు.



బీజేపీ ఆధ్వర్యంలో మల్కాజిగిరిలో నిర్వహించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ విజయ సంకల్ప షోకు వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో తరలి వెళ్తున్న బీజేపీ శ్రేణులు
- వనస్థలిపురం, ఆంధ్రజ్యోతి

కవిత అరెస్ట్ అప్రజాస్వామికం

- బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్‌శర్మ



మాట్లాడుతున్న అరవింద్‌శర్మ

ఎల్బీనగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అప్రజాస్వామికమని బీఆర్‌ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆర్‌కేపురంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కవితను ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అక్రమంగా అరెస్ట్ చేసిందన్నారు. బీజేపీ ప్రభుత్వం కావాలనే కవిత పేరును కేసులో చేర్చి వేధింపులకు గురిచేస్తున్నదని ఆయన ఆరోపించారు. కవితను అరెస్ట్ చేయమని కోర్టుకు చెప్పిన అధికారులు కేంద్రం ఒత్తిడితోనే అరెస్ట్ పర్వానికి తెరలేపారన్నారు. కవిత అరెస్ట్‌తో లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధి పొందాలనే ఉద్దేశంతోనే ఈ చర్యకు పాల్పడ్డారన్నారు. బీఆర్‌ఎస్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక కాంగ్రెస్, బీజేపీలు కలిసి నాటకాలాడుతున్నాయని ఆయన ఆరోపించారు.



బోర్లను పరిశీలిస్తున్న జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, స్థానికులు

సహభావన టౌన్‌షిప్‌లో వేసిన బోర్లను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

మన్సూరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి మాజీ ఎంపీ రేవంత్‌రెడ్డి ఎంపీగా ఉన్నప్పుడు విడుదల చేయించిన ఎంపీ ల్యాడ్స్ నుంచి వేసిన రెండు బోర్లను కాంగ్రెస్ నేత జక్కిడి ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. సహభావన టౌన్‌షిప్ సీ-బ్లాక్‌లో నీటి ఇబ్బందులను పరిష్కరించేందుకు రూ.6లక్షలతో 800 అడుగుల మేర బోర్లు వేయించామని జక్కిడి వెల్లడించారు. సీ బ్లాక్ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి వెంకన్న, మునీందర్, నాయకులు చెరుకు చిరంజీవి, జాలె వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ, రమేష్, గిరి, చంద్రశేఖర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎస్‌ఐబీలో ఏకచ్ఛత్రాధిపత్యం

(5వ పేజీ తరువాయి)

కెమెరాలను ఆపివేసి, ఏళ్ల తరబడి హార్డ్ డ్రైవ్స్‌లో ఉన్న డాటాను ధ్వంసం చేసి, వాటి స్థానంలో కొత్త హార్డ్ డ్రైవ్‌లను ఏర్పాటు చేసినట్లు పోలీసులు రిమాండ్ రిపోర్టులో వెల్లడించారు. పోలీసులు ప్రణీత్‌కుమార్‌పై పలుసెక్షన్‌లతోపాటు ఐటీ యాక్ట్‌లు ప్రయోగించి కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా డీసీఆర్‌బీ వర్టికల్ విభాగానికి బదిలీ అయిన ప్రణీత్‌రావును జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి ఆధ్వర్యంలో పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ బి. శోభన్, ఎస్‌ఐ పి.ప్రదీప్ బృందం ఈనెల 12న రాత్రి 10:30కు అరెస్టు చేసి హైదరాబాద్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ప్రణీత్‌రావు నుంచి పోలీసులు ఒకలాప్‌టాప్, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అప్పటికే సేకరించి పెట్టుకున్న సమాచారంతో ప్రశ్నించగా, ప్రణీత్‌రావు నేరాన్ని అంగీకరించాడు. అనంతరం ఆస్పత్రికి తరలించి కొవిడ్‌తో పాటు ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. ప్రణీత్‌రావు కేసు విచారణ అధికారిగా జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరికి అప్పగించారు. కాగా.. ఆయన టీమ్‌లో ఇన్‌స్పెక్టర్లు శోభన్, వెంకటేశ్వర్‌రెడ్డి, రాఘవేంద్ర, శ్రీనివాసులు ఉన్నట్లు వెల్లడించారు.

అదనపు అంతస్తుకు రూ.1.20 కోట్లు

- డిమాండ్ చేసిన విలేకరి, సెక్షన్ ఆఫీసర్
- పోలీసులను ఆశ్రయించిన నిర్మాణదారుడు.. ఇద్దరి అరెస్ట్

బంజారాహిల్స్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): అదనపు అంతస్తు నిర్మించుకునేందుకు ఏకంగా రూ.1.20 కోట్లను ఓ విలేకరి, జీహెచ్‌ఎంసీ సెక్షన్ ఆఫీసర్ డిమాండ్ చేశారు. అంత డబ్బు ఇవ్వలేనని అదనపు అంతస్తు నిర్మాణాన్ని కూడా నిర్మాణదారుడు విరమించుకున్నాడు. అయితే, వేధింపులు ఆగలేదు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు.10లో ప్రసాద్ భవన నిర్మాణం చేపట్టాడు. ఆయనకు రెండు అంతస్తుల వరకు నిర్మాణానికి అనుమతి ఉంది. నిబంధనలు అతిక్రమించి మూడో అంతస్తు నిర్మాణం చేపట్టారు. సమాచారం అందుకున్న జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. ఇదిలా ఉండగా, నిర్మాణదారుడి వద్ద నుంచి డబ్బు లాగేందుకు జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారి విశాల్, విలేకరి ఆకుల కిరణ్‌గౌడ్ పథకం వేశారు. ఈ మేరకు విశాల్ కొద్ది రోజుల క్రితం నిర్మాణదారుడు ప్రసాద్ వద్దకు వెళ్లి భవనంపై ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పాడు. ఫిర్యాదుదారుడైన కిరణ్‌గౌడ్‌తో మాట్లాడుకోవాలని సూచించాడు. ప్రసాద్ ఒప్పుకొని కిరణ్‌కు ఫోన్ చేశాడు. ఫిర్యాదు వెనక్కి తీసుకుంటానని చెప్పిన కిరణ్ అదనపు అంతస్తు నిర్మించుకోవాలంటే జీహెచ్‌ఎంసీ, మీడియాకు కలిసి రూ.1.20 కోట్లు ఇవ్వాలని అడిగాడు. దీనికి ప్రసాద్ ఆశ్చర్యపోయాడు. నిర్ణయం తీసుకునేందుకు కొంత సమయం అడిగాడు. అనంతరం అదనపు అంతస్తు నిర్మాణం ఆలోచనను విరమించుకున్నాడు. కిరణ్ వేధింపులు ఆగలేదు. ప్రతీ రోజు ఫోన్ చేసి డబ్బు ఎప్పుడు ఇస్తారు అంటూ వేధించడం మొదలుపెట్టాడు. దీంతో నిర్మాణదారుడు పశ్చిమ మండలం డీసీపీ దృష్టికి తీసు కెళ్లగా ఆయన సూచన మేరకు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కిరణ్ డబ్బు అడిగినట్లు ఆడియో టేపులతోపాటు ఇతర ఆధారాలు అందజేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు కిరణ్‌గౌడ్‌తో పాటు విశాల్‌ను అరెస్టు చేశారు. సెక్షన్ 384, 506, 120బి ఐపీసీ కింద కేసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కిరణ్‌గౌడ్ గతంలో భవన నిర్మాణదారుల వద్ద డబ్బు డిమాండ్ చేసిన కేసులు అనేకం ఉన్నాయని తేలింది. ఓ నిర్మాణదారుడి వద్ద డబ్బు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. బంజారాహిల్స్‌తో పాటు మరో పోలీసుస్టేషన్‌లో కూడా కిరణ్‌గౌడ్ పై కేసులు ఉనట్టు పోలీసుల విచారణలో తేలింది.

శంషాబాద్ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కన్హా శాంతివనం సందర్శనకు నేడు భారత ఉప రాష్ట్రపతి రానున్నారు. ఈ సందర్భంగా శంషాబాద్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నందిగామ పరిసరాల్లో నేడు, రేపు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ తెలిపారు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయి. హైదరాబాద్ నుంచి వచ్చే ట్రాఫిక్‌ను గొల్లపల్లి టోల్‌గేట్ వయా పెద్దగోల్కొండ మీదుగా ఇండియన్ బేకరీ(తొండుపల్లి), బుర్జుగడ్డ వద్ద యూటర్న్ తీసుకొని ముచ్చింతల్, మన్సాన్‌పల్లి ఎక్స్‌రోడ్డు, అమీర్‌పేట్, తిమ్మాపూర్, షాద్‌నగర్ మీదుగా మళ్లిస్తారు. అలాగే, గచ్చిబౌలి నుంచి వచ్చే ట్రాఫిక్‌ను పెద్దగోల్కొండ టోల్‌గేట్, మన్సాన్‌పల్లి ఎక్స్ రోడ్డు, అమీర్‌పేట్, తిమ్మాపూర్, షాద్‌నగర్ మీదుగా మళ్లిస్తారు. షాద్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో షాద్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ట్రాఫిక్‌తోపాటు పెంజర్ల ఎక్స్‌రోడ్డు నుంచి వచ్చే ట్రాఫిక్‌ను అమీర్‌పేట్ మన్సాన్‌పల్లి ఎక్స్‌రోడ్డు నుంచి పెద్దగోల్కొండ టోల్‌గేట్, శంషాబాద్, హైదరాబాద్ వైపు మళ్లిస్తారు. ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పైన తెలిపిన ప్రాంతాల్లోనే ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని జాయింట్ సీపీ పేర్కొన్నారు. వాహనదారులు ట్రాఫిక్ ఆంక్షలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గమ్యస్థానాలకు చేరుకోవాలని, ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని ఆయన సూచించారు.

రూ. 7కోట్లు కొల్లగొట్టారు..

- రియల్ ఎస్టేట్ ముసుగులో ఘరానా ఆర్థిక మోసం
- ఆకర్షణీయ లాభాలంటూ నమ్మించారు..
- ఇద్దరి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ ముసుగులో ఘరానా ఆర్థిక మోసాలకు పాల్పడి రూ. 7కోట్లు కొల్లగొట్టిన కేటుగాళ్లను సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం (ఈవోడబ్ల్యూ) అధికారులు అరెస్ట్ చేశారు. ఈవోడబ్ల్యూ డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్‌కు చెందిన తమ్మినీడి వెంకటప్రసాద్ కొర్రపాటి వెంకటరత్నం, వెంకట చిరంజీవి, విఠల్‌రెడ్డి తదితరులు కలిసి జేజే ఇండియా ఇన్‌ఫ్రా ప్రై.లిమిటెడ్ పేరుతో రియల్ ఎస్టేట్ సంస్థను ప్రారంభించారు. దానికి తమ్మిడి వెంకటప్రసాద్ ఎండీగా, వెంకటరత్నం మార్కెటింగ్ ఏజెంటుగా ఉన్నారు. తమ సంస్థలో పెట్టుబడులు పెడితే తక్కువ సమయంలోనే అధిక లాభాలు వస్తాయంటూ నమ్మించారు. మహేశ్వరం, గచ్చిబౌలి, ఆమనగల్, శిల్పారామం తదితర ప్రాంతాల్లో వెంచర్స్, వ్యవసాయ భూములు ఉన్నాయని చూపించారు. సరిగ్గా మూడేళ్లలో ప్రాజెక్టులు పూర్తవుతాయని నమ్మించారు. ముందుగా పెట్టుబడి పెట్టినవారికి వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో రూ. 10వేలకు ఎస్‌ఎఫ్‌టీ చొప్పున కేటాయిస్తామని, ఆ తర్వాత ప్రతి నెల ఒక్క ఎస్‌ఎఫ్‌టీకి రూ. 100ల చొప్పున అద్దె చెల్లిస్తామని అలా 30 నెలల్లోనే పెట్టుబడి డబ్బుకు అధిక మొత్తంలో లాభాలు వస్తాయని నమ్మించారు. ఆకర్షణీయమైన బ్రోచర్లు, పేపర్ ప్రకటనలు ఇచ్చి కస్టమర్స్‌ను ఆకర్షించారు. వారి మాటలు నమ్మి పెట్టుబడుల రూపంలో ఎనిమిది మంది బాధితులు రూ. 3.56కోట్లు డబ్బులు చెల్లించారు. డబ్బులు చేతికి అందిన తర్వాత నిందితులు లాభాలు ఇవ్వడం అటుంచి స్పందించడం మానేశారు. దాంతో బాధితులు సైబరాబాద్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. డీసీపీ కె. ప్రసాద్, ఏసీపీ ఎస్. రవీందర్ పర్యవేక్షణలో ఈవోడబ్ల్యూ పోలీసులు రంగంలోకి దిగి ప్రధాన నిందితులు తమ్మిడి వెంకట ప్రసాద్, కొర్రపాటి వెంకటరత్నంలను అరెస్టు చేశారు. వారిని విచారించిన క్రమంలో సుమారు 15 మంది నుంచి రూ. 7 కోట్లు వసూలు చేసినట్లు తేలింది. జేజే ఇన్‌ఫ్రాతో పాటు.. తరణి అవెన్యూ, ఎల్‌ఎల్‌పీ పేరుతో సంస్థలు ఏర్పాటు చేసి పెట్టుబడుల పేరుతో డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు.